క్లుప్తంగా

హరీశ్‌రావు పరామర్శ



తిరుపతిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో మెదక్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి సోదరుడు పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి, గాలి కుమార్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నరేందర్, కంఠారెడ్డి కొండల్‌రెడ్డి, నారాగౌడ్, వెంకటస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



కూచారంలో గడ్డిని తొలగిస్తున్న యువత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో 295వ వారం స్వచ్ఛభారత్ చేపట్టి పలు వీధులను శుభ్రం చేశారు. గ్రామంలోని యువజన భవనం వద్ద గడ్డిని తొలగించారు. పలు వీధులను శుభ్రం చేశారు. చెత్త చెదారాన్ని తొలగించి డంప్ యార్డ్‌కు తరలించారు.

రేపు చాకరిమెట్లలో హుండీ లెక్కింపు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయహుండీ 19న లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. 3 నెలలకు సంబంధించి హుండీ ఆదాయం మంగళవారం ఉదయం 11 గంటలకు భక్తుల సమక్షంలో లెక్కించనున్నట్లు చెప్పారు.

మైనంపల్లిని కలిసిన ఖాజాపూర్ గ్రామస్తులు



మైనంపల్లి హన్మంతరావును కలిసిన ఖాజాపూర్ గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును మండలంలోని ఖాజాపూర్ గ్రామస్తులు కలిశారు. ఆదివారం దూలపల్లిలో మైనంపల్లి నివాసంలో ఖాజాపూర్ ఎస్సీ కాలనీవాసులు కలిశారు. ఖాజాపూర్ గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, పవన్ తదితరులు ఉన్నారు.

అభిమాని తలపై సీడీఆర్



సీడీఆర్ అని కటింగ్ చేయించుకున్న శ్రీనివాస్

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్ గ్రామానికి చెందిన పెద్దగొల్ల శ్రీనివాస్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేరును సీడీఆర్ అని ఇంగ్లీష్ అక్షరాల్లో కటింగ్ చేయించుకున్నారు.

మనోహరాబాద్‌కు అయోధ్య అక్షింతలు



శోభయాత్రగా వచ్చిన అక్షింతల కలశంతో భక్తులు

మనోహరాబాద్(తూప్రాన్): అయోధ్య రామాలయం నుంచి అక్షింతల కలశం ఆదివారం మండల కేంద్రం మనోహరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు మనోహరాబాద్ మండల కేంద్రంలో అక్షింతల కలశం శోభయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన అయోధ్య రాముడి నుంచి వచ్చిన అక్షింతలను జనవరి 1 నుంచి మండల గ్రామాల్లోని ప్రతి ఇంటికి అందజేస్తామని తెలిపారు.

కష్టాల కస్తూర్బా

- చలిలోనూ చన్నీళ్ల స్నానమే..
- నిత్యం మంచినీటి కొరత
- నీళ్ల చారు.. ఉడికీఉడకని అన్నం
- సమస్యలతో తల్లడిల్లుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



కేజీబీవీలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



కేజీబీవీలో మరమ్మతులకు నోచుకొని వాటర్ ప్యూరిఫైయర్

టేక్మాల్(మెదక్): కస్తూర్బా కష్టాలకు నిలయమైంది. చదువుతో పాటు హాస్టళ్లలో సౌకర్యాలు లేకపోవడంతో నిత్యం విద్యార్థులు తల్లడిల్లుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పౌష్టికాహారం అందడం లేదు

టేక్మాల్ కేజీబీవీలో 194 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. వసతులు సరిగ్గా లేవు. కేజీబీవీలోని తాగునీటి ప్యూరిఫైయర్ కొన్నేళ్లుగా పాడైపోయినా.. మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో విద్యార్థులకు బోరు నీరే దిక్కయింది. మెనూ ప్రకారం భోజనం పెట్టాల్సిన అధికారులు ఆలుగడ్డ పప్పు చారు, అన్నంతో సరిపెడుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో సైతం మెనూ పాటించడంలేదని, పౌష్టికాహారం అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

కేజీబీవీలో ఉన్నత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రిన్సిపాల్‌తో పాటూ టీచర్లు సమయపాలన పాటించడం లేదు. హాస్టల్‌లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తమ సమస్యలను ఎవరికైనా చెబితే టీచర్స్ తిడతారని వారు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.



ఆలుగడ్డతో భోజనం

చన్నీటి స్నానం..

జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. చలి తీవ్రతకు అందరూ పలు జాగ్రతలు పాటిస్తున్నారు. కానీ కేజీబీవీ విద్యార్థులకు మాత్రం ఎముకలు కొరికే చలిలో సైతం చన్నీటి కష్టాలు తప్పడం లేదు. అక్కడ ఉన్న సోలార్ పవర్ పనిచేయడం లేదని వేడి నీళ్లు పెట్టడం లేదు. దీంతో విద్యార్థులు చన్నీటి స్నానం చేస్తూ అనారోగ్యాల పాలవుతున్నామని వాపోతున్నారు.

రక్షితవాటర్ ట్యాంకుకు వాల్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

శివ్వంపేట(నర్సాపూర్): రక్షితవాటర్ ట్యాంకుకు అధికారులు స్పందించి నూతన వాల్ ఏర్పాటు చేశారు. మండల కేంద్రం శివ్వంపేట హనుమాన్ నగర్‌లోని రక్షితవాటర్ ట్యాంకుకు సంబంధించి పాడైపోయిన వాల్ విషయం గురించి 'సాక్షి' దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించారు. పాడైపోయిన వాల్‌ని తొలగించి కొత్త వాల్‌ను బిగించారు. దీంతో హనుమాన్ ట్యాంకు పరిధిలోని కాలనీ వాసులకు నీటి ఎద్దడి సమస్య పరిష్కారం అయిందని సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.



ట్యాంకుకు ఏర్పాటు చేసిన వాల్

మంత్రిని కలిసిన ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు

టేక్మాల్(మెదక్): సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటించారు. ఈ సందర్భంగా టేక్మాల్‌కు చెందిన ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు నిమ్మవాణి కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. మండలంలోని ఎల్లుపేటలో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి కృషి చేస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మరమేశ్, నాయకులు విద్యాసాగర్, చల్ల అనిల్ తో పాటు తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయంలో భక్తులు



శివ్వంపేట(నర్సాపూర్): లక్ష్మీనర్సింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా ధనుర్మాసంలో స్వామివారి జాతర మహోత్సవం ప్రారంభమై ఉగాది వరకు ప్రతి ఆదివారం జరుగుతాయి. అందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ మహావిష్ణువుకి అత్యంత పవిత్రమైన ఈ నెల రోజులు విశేష పూజలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ తెలిపారు. నిత్యం ప్రాతః కాలంలో తిరుప్పావై పఠనం ఉంటుందని చెప్పారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్, సిబ్బంది నర్సింహారెడ్డి, అర్చకుడు విద్యాకర్‌చారి తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో

రామాయంపేట(మెదక్): పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. నెలరోజుల పాటు ప్రతిరోజూ ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. మొదటిరోజు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పల్లకిసేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీనివాస నిధికి వ్యాపారి చింతల శ్రీనివాస్ విరాళం అందజేశారు.



రామాయంపేట (మెదక్): పూజలు నిర్వహిస్తున్న పురోహితుడు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరి ఆలయంలో అర్చకులు ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని తునికి నల్లపోచమ్మ ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఏఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి, వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



చాముండేశ్వరి ఆలయంలో భక్తులకు అమ్మవారి కుంకుమ ఇస్తున్న అర్చకుడు

కృత్రిమ అవయవాలతో కొత్త జీవితం



కృత్రిమ కాళ్లతో దివ్యాంగులు

ములుగు(గజ్వేల్): ఎంతో భవిష్యత్ కలిగి ఉండి వివిధ కారణాలతో అవయవాలు కోల్పోయిన వారికి కృత్రిమ అవయవాలు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తాయని గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం సహకారంతో ములుగు, తూప్రాన్, గజ్వేల్ మండలాలకు చెందిన గోపమ్మ, నర్సింలు, శంకర్, వెంకటేష్, మైసయ్య అనే దివ్యాంగులకు వికారాబాద్‌లో ఆదివారం ఉచితంగా కృత్రిమ కాళ్లను అమర్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలో ముందుకు సాగుతున్న తమ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించనట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌ను ఆదివారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



రాందాస్‌గూడలో బోనాల ఊరేగింపు

ఘనంగా పోచమ్మ బోనాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని రాందాస్‌గూడ గ్రామస్తులు ఆదివారం ఘనంగా పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. గ్రామస్తులతో డప్పుచప్పుళ్లతో, పోతురాజుల విన్యాసాలతో, యువకుల, చిన్నారుల నృత్యాలతో బోనాలను ఉత్సాహంగా ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. సర్పంచ్ యాదగిరి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బీమా చెక్కుల అందజేత



చేగుంట(తూప్రాన్): బీమా చెక్కును అందిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త చిన్నోళ్ల ప్రభాకర్ కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో ఆదివారం వల్లూర్ గ్రామపంచాయతీ వద్ద బాధిత కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ బీమా రూ. 2 లక్షల చెక్కును దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో చెట్ల తిమ్మాయిపల్లి సర్పంచ్ మోహన్‌రాథోడ్, ఉపసర్పంచ్ ముకేశ్ ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ప్రభాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉంది. దీంతో పార్టీ తరఫున రూ.2లక్షల బీమా మంజూరైనట్లు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మృతుడి భార్య శ్యామలకు ఎమ్మెల్యే చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ మోహన్‌రాథోడ్, ఉపసర్పంచ్ ముఖేశ్‌గౌడ్, చిన్నొల్ల భాస్కర్, బోనాల బాలు తదితరులు ఉన్నారు.

అధ్వానంగా జూ.కళాశాల భవనం

- నిరుపయోగంగా వాటర్ ప్లాంట్
- విద్యార్థులకు అందని తాగునీరు
- నాణ్యతలేని పనులు చేసిన కాంట్రాక్టర్

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం అధ్వానంగా మారింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కళాశాలలో నాణ్యత లేకుండా నిర్మించిన వాటర్ ప్లాంట్ వృథాగా మారింది. భవనం నిర్మాణం జరిగినా ఏడాదికే తరగతి గది గోడలు పెచ్చులూడుతున్నాయి. అలాగే కళాశాలలోని పై అంతస్తులో తరగతి గదిలో ఇప్పటికి బండలు వేయలేదు. ఇదీ అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల దుస్థితి.



అల్లాదుర్గం జూనియర్ కళాశాలలో వృథాగా వాటర్ ప్లాంట్

ఏడేళ్లుగా కళాశాలలో పూర్తికాని పనులు

అల్లాదుర్గంలో 2001 సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. 2016 తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ కింద ప్రభుత్వం రూ. 2 కోట్ల 50 లక్షలు కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ అప్పటి ప్రభుత్వ అధికారుల అండదండలతో అసంపూర్తిగానే పనులను వదిలేశాడు. దీంతో 2022లో మంత్రి హరీశ్‌రావు ఆ కళాశాలను అలాగే ప్రారంభించారు. కళాశాలలోని పై అంతస్తులో తరగతి గదిలో ఇప్పటికీ బండలు వేయకుండా వదిలి వేశారు.

కాంట్రాక్టర్ నాణ్యత లేని పనులు చేపట్టడంతో ఆగస్టు 3న తరగతి గదిలో గోడలు పెచ్చులూడి పడ్డాయి. తృటిలో ప్రమాదం తప్పడంతో విద్యార్థులు ఊపిరి పిల్చుకున్నారు. మరుసటి రోజు కాంట్రాక్టర్ కూలిన గోడల పెచ్చులకు మరమ్మతులు చేసి వెళ్లిపోయారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్‌కు నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ ప్లాంట్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు చెబుతున్నారు. మూడేళ్లుగా ప్లాంట్ వృథాగా మారిందన్నారు. అధికారులు మాత్రం కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కొత్త ప్రభుత్వంలోని అధికారులు భవన నిర్మాణంలో అక్రమాలపై విచారణ చేపట్టాలని, వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.



తరగతి గదిలో గోడలు పెచ్చులూడిన దృశ్యం(ఫైల్)

ఆదరణ ఫుల్.. బస్సులు నిల్



వెలికట్ట క్రాస్ రోడ్డు బస్సు కోసం వేచి ఉన్న మహిళలు

కొండపాక(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అమలు చేసిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం బాగానే ఉన్నప్పటికీ బస్సుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద నుంచి నిత్యం వివిధ పనుల నిమిత్తం కొండపాక, చేర్యాల, జనగామ పట్టణాల నుంచి ప్రజలు ఇక్కడికి వచ్చి హైదారాబాద్‌కు వెళ్తుంటారు. ఈ చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్సులో హైదారాబాద్, గజ్వేల్, తూప్రాన్ తదితర పట్టణాలకు వెళ్లేందుకు వేచి చూస్తారు. దీనికి తోడు ఇటీవల ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసింది. దీంతో మహిళలు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సెలవు రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వివిధ పనులపై వెళ్లే మహిళలు ఆర్టీసీ బస్సు కోసం సుమారు అరగంట నుంచి గంట పాటు వేచి చూస్తున్నామని చెబుతున్నారు. కనీస అవసరాలు తీర్చుకునేందుకు సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయిస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చేర్యాల, జనగామ పట్టణాల రూట్‌లో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచడంతో పాటు టాయిలెట్స్, మూత్రశాలలు నిర్మించాలని కోరుతున్నారు.